విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

శుక్రవారం 14 మార్చి, 2025 | 4 పేజీలు

టిడ్కో ఇండ్లు పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తాం..

అసెంబ్లీలో మంత్రి నారాయణ

విశాలాంధ్ర – నెల్లూరు బ్యూరో
టిడ్కో ఇళ్ల లబ్దిదారుల తొలగింపు, మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో మంత్రి నారాయణ మాట్లాడుతూగత ప్రభుత్వం 22,640 మంది టిడ్కో లబ్దిదారులను తొలగించి వేరే వారికి ఇళు కేటాయించింది. కేవలం 57వేల 40 ఇళ్లను మాత్రమే వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. లబ్దిదారుల మార్పులో అవకతవకలపై కమిటీ వేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

2లో

రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ, రైతుసంఘం నాయకులు

విశాలాంధ్ర – నెల్లూరు బ్యూరో: రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులతో కలిసి దామా అంకయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తామని జిల్లా అధికారులు చెప్తున్నారు కానీ వాస్తవాలు రూపంలో అది ఆచరణలో లేదని మిల్లర్లు రైతుల వద్ద గిట్టుబాటు ధర కంటే ?2,000 నుంచి ?1000 వరకు తగ్గించి ఇస్తున్నారని దీనిపైన స్థానికంగా ఉండే అధికారులకు రైతులు విన్నవించిన ఫలితం లేదని ఆయన విమర్శించారు జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షానవాజ్, ముదివర్తి బాబు, వెంకటేశ్వర్లు మహిళా సంఘం నాయకురాలు శిరీష లు పాల్గొన్నారు.

దేశంలోనే గొప్ప పర్యటక కేంద్రంగా

బారాషాహిద్ దర్గా

2లో

24 గంటల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు జమ

జిల్లా కలెక్టర్ ఆనంద్ వెల్లడి

విశాలాంధ్ర – నెల్లూరు బ్యూరో: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24గంటల్లోనే నగదు జమచేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రేబాల రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని ఎలా నిర్ధారిస్తారో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 300ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇప్పటి వరకు సుమారు 4వేలకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులందరూ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించి, సకాలంలో డబ్బులు పొందాలని సూచించారు. ధాన్యం డబ్బులను 24 నుంచి 48గంటల్లోనే జమ చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం డబ్బులు 24 గంటల్లో జమ అయిన రైతులు ప్రభుత్వం వెంటనే డబ్బులు ఇస్తుందనే ప్రచారం ముమ్మరంగా చేపట్టి మిగిలిన రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎంపిడివో, తహశీల్దారు, వ్యవసాయాధికారి ఒక బృందంగా, మండలాల ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టారని చెప్పారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వంప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని అన్నదాతలకు పిలుపునిచ్చారు. రైతులు జిపిఎస్ కలిగిన ట్రాక్టర్ ఒక్కటే వుందని, సరిపడ లేనందున ధాన్యం రవాణాకు ఇబ్బందిగా వుందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సరిపడ జీపీఎస్ ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని అధికార్లను ఆదేశించారు. అలాగే ధాన్యం నిల్వ చేసుకునేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గోడౌన్లను రైతులకు అందుబాటులో వుంచాలని డిసిఏ గుర్రప్పను ఆదేశించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డిఎం అర్జున్‌రావు, డిసిఓ గుర్రప్ప, ఎంపిడివో శ్రీహరి, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ జొన్నవాడ గ్రామంలో ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయిస్తున్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. బుచ్చి నుంచి నెల్లూరు వెళుతూ మార్గమధ్యలో కారు ఆపి ధాన్యం విక్రయిస్తున్న రైతులతో కలెక్టర్ ముఖాముఖీగా మాట్లాడారు. ఎందుకు ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నారని, ఎంత ధరకు ధాన్యం విక్రయిస్తున్నారని అడిగారు. ఇందుకు రైతులు బదులిస్తూ ఈక్రాప్‌లో తమ పంట నమోదు కాలేదని, 17వేలకు ఇక్కడికే వచ్చి మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని, శ్రమ తప్పుతుందని వారికే విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి విక్రయిస్తే 24 గంటల్లో డబ్బులు వస్తున్నాయని, మీరు కేవలం సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంప్రదిస్తే చాలని వారే షెడ్యూలు ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని చెప్పారు. గోతాలు, రవాణాఖర్చులు, లేబర్‌చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించి, 24 నుంచి 48 గంటల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం డబ్బులు జమచేస్తున్నట్లు కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు.

'స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర'లో భాగస్వాములు కావాలి: కలెక్టర్

విశాలాంధ్ర – నెల్లూరు బ్యూరో: ప్రతి మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో అందరినీ భాగస్వాములు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు జిల్లా అంతట ప్రజా ఉద్యమం లాగా ఈ కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు.బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అమరావతి నుండి పదవ తరగతి పరీక్షలు, స్వచ్ఛ ఆంధ్ర ,జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్, ప్రజల సంతృప్తి ,పి4 విధానాలపై అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో ప్రజలను, ప్రజా ప్రతినిధులను, యన్‌జీవోలు, స్వయం శక్తి సంఘాలు ,ప్రైవేట్ సంస్థలను భాగస్వాములు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్టంగా నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో సమస్యలు ఎదురైతే తెలియజేయడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్, రెవిన్యూ వైద్య,ఆరోగ్య సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, మౌలిక వసతులతో పాటు ఒక ఏఎన్ఎం కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఫేక్ న్యూస్ సృష్టించేవారు, వాటిని వ్యాపింప చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి ఎవరికి సెల్ ఫోన్లు అనుమతి లేదని, తెలిపారు.వీలున్నంత వరకు సెల్‌ఫోన్ తీసుకు రావద్దని తెలిపారు.ప్రభుత్వం వైద్యశాలలు, రెవిన్యూ, పెన్షన్లు, ఆలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకుంటుందని ,కనుక ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మంచి సేవలు అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 24,25 తేదీలలో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వివరించడానికి అన్ని శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

నెల్లూరు ట్రాఫిక్ సమస్యలకు చర్యలు చేపట్టాలి

శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర – నెల్లూరు బ్యూరో: శాసనమండలి సమావేశాలలో నెల్లూరులో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతు న్నందున ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్లను విశాలమైన ప్రాంతంలోకి తరలించాలని శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరినఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి. 2006 నుంచి నెల్లూరు నగరం విస్తరించి మహానగరంగా అభివృద్ధి చెందుతున్నందున నెల్లూరులో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. నెల్లూరు నగరంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లను. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా గతంలోనే వాటిని ఇతర ప్రాంతాలకు మార్చేందుకు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. కానీ ఇప్పటివరకు నూతన బస్టాండ్ల ఏర్పాటుకు అడుగు ముందుకు పడలేదన్నారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్‌ను.. నెల్లూరు నగరం వెలుపల నూతన బస్టాండ్‌లను నిర్మించివాటిని అక్కడికి తరలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్లను.. సిటీ బస్టాండ్లుగా వినియోగించుకుంటే ట్రాఫిక్ సమస్యను నివారించవచ్చని ప్రభుత్వానికి తెలిపారు.

టిడ్కో ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం..

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులున్న మాట వాస్తవమేనని, 77606 మందికి ఇళ్లు వారి పేరు మీద బ్యాంకు లోన్ తీసుకున్నారని, దీనివల్ల ఇళ్లు లేకుండానే వారిపై ఈఎంఐ భారంతో పాటు ఎన్పీఏ కి బ్యాంకులు వెళ్తున్నాయని తెలిపారు. బ్యాంకులకు లోన్లు కట్టేందుకు సీఎం చంద్రబాబు 140 కోట్లకు అనుమతించడం జరిగిందన్నారు. త్వరలోనే బ్యాంకులకు ఈ బకాయిలు చెల్లించనున్నామని మంత్రి తెలిపారు. టిడ్కో ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు హడ్కో 4460కోట్లు రుణం ఇస్తుందని, అర్బన్ అథారిటీల సహకారంతో మౌలిక వసతుల కల్పన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నానన్నారు. జూన్ 12నాటికి పెండింగ్‌లో ఉన్న 365,430 చదరపు అడుగుల ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వివరించారు.

కొండబిట్రగుంట తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

- డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు

విశాలాంధ్ర - కావలి: కొండబిట్రగుంట తిరునాళ్ల సందర్భంగా శనివారం కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఎపియస్ ఆర్టీసీ, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గరుడసేవ, తెప్పోత్సవం మరియు స్వామివారి కళ్యాణం జరిగే మూడు రోజులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతామని, ఈ సంవత్సరం కూడా సదరు సేవలు నిర్వహించే దినాలైన బుధ, గురు, శుక్రవారాలలో బస్సులు ఏర్పాటు చేశామని అయన తెలిపారు. ఐతే దేవస్థాన అధికారులు మరియు భక్తుల కోరిక మేరకు శనివారం కూడా బస్సులు నడుపనున్నామని అయన పేర్కొన్నారు. శనివారం మూడు బస్సులు కేటాయించామని, అవసరాన్ని బట్టి ఆ సంఖ్యను పెంచగలమని అయన వివరించారు. భక్తులకు బస్సుల విషయంలో ఏ అవసరం కలిగినా తన ఫోన్ 9959225643 ను సంప్రదించాలని డిపో మేనేజర్ కొరారు.

ఉద్యోగాలకు 12మంది అభ్యర్థులు ఎంపిక

విశాలాంధ్ర - కావలి: స్థానిక డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నాడు చెన్నైకి చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ కంపెనీ మదర్ సన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగ ఎంపిక నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా ఈసీఈ భాగానికి చెందిన 50మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా మూడు రౌండ్ల ఎంపిక విధానంలో 12 మంది విద్యార్థినిలు మూడు రౌండ్లను ఎదుర్కొని 2.52 ఐపీఎ ప్యాకేజీగా ఉద్యోగాలకు ఎంపిక అవ్వటం పట్ల డి.బి ఎస్.ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కళాశాలలో 12మంది ఈసీఈ విభాగానికి చెందిన అమ్మాయిలు మంచి ప్యాకేజీతో చెన్నైకి చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు పొందటం గర్వించదగ్గ విషయమని ఇకముందు కూడా ప్రముఖ కంపెనీలను కళాశాలకు ఆహ్వానించి నూరు శాతం ఉద్యోగ కల్పనా ధ్యేయంగా పనిచేస్తామని ప్రతి విద్యార్థి ఉద్యోగులుగా బయటకి వెళ్లే విధంగా చూస్తామని ఆయన తెలియజేస్తూ ఉద్యోగులుగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు మాట్లాడుతూ మదర్‌సన్ కంపెనీ ప్రతి సంవత్సరం కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులను తమ కంపెనీకి తీసుకోవడానికి అంగీకారం తెలిపిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.సురేష్, కళాశాల ఏవో జీ.రమేష్ బాబు ఈసీ విభాగ అధిపతి కె.వేణుగోపాల్ ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర - కావలి: కావలి పట్టణం కావలి కాటన్ స్టోర్ యజమాని పాలిశెట్టి శ్రీనివాసులు - సునీత దంపతుల మనవడు గౌతమ్ కుమార్ - గౌతమి దంపతుల కుమారుడు చిరంజీవి చాణక్య రామ్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచితంగా కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న నిరుపేద మహిళ షేక్ సుల్తాన్ బీబీకి స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషను బహుకరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు పాలిశెట్టి. శ్రీనివాసులు -సునీత దంపతులు, బాబు తల్లిదండ్రులు గౌతం కుమార్ - గౌతమి దంపతుల,దాత కుమార్తె అమూల్య, సంస్థ సీనియర్ సభ్యులు ఎంవిఎన్ ప్రసాద రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, కుట్టు శిక్షణా ట్రైనర్ ఆయేషా, కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ సభ్యులు ఎంవిఎన్ ప్రసాద రావు మాట్లాడుతూ చిరంజీవి చాణక్య రామ్ మొదటి పుట్టిన రోజును పురస్కరించుకోని పేద మహిళకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషను బహుకరణ చేసిన దాతలు పాలిశెట్టి శ్రీనివాసులు - సునీత దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.అలాగే ఈ రోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న జిరంజీవి చాణక్య రామ్ కు సంయుక్త సేవా సంస్థ ద్వారా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నామని, చాణక్యరామ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆ భగవంతుడు చాణక్య రామ్‌కి మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న సురేంద్రను అభినందించారు. లబ్ధిదారులు షేక్ సుల్తాన్ బిబీ మాట్లాడుతూ తనకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషను అందజేసిన దాతలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అలాగే ఈ రోజు పుట్టినరోజు జరుపుకుంటున్న బాబుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలోనే గొప్ప పర్యటక కేంద్రంగా బారాషాహిద్ దర్గా

విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో: దక్షిణ భారతదేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా బారాషహీద్ దర్గాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. బుధవారం సాయంత్రం బారాష హీద్ దర్గా ఉత్తర, దక్షిణ ముఖద్వారాల నిర్మాణ పనులకు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ సూర్యతేజతో కలిసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నుడా, మున్సిపల్ కార్పొరేషన్‌లో అందుబాటులో వున్న నిధులను వినియోగించి దర్గా ఆర్చి నిర్మాణ పనులు మొదలుపెడుతున్నట్లు చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా బారాషహీద్ దర్గా సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి టూరిజం డిపార్టు మెంటుకు పంపనున్నట్లు చెప్పారు. దర్గాలో మసీదు నిర్మాణానికి ముఖ్యమంత్రి మంజూరు చేసిన 5కోట్ల నిధుల మంజూరుకు కూడా కృషిచేస్తున్నట్లు చెప్పారు.

రొట్టెల పండుగ నాటికి ఆర్చి నిర్మాణాలు పూర్తి: ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 85లక్షలతో ఆర్చి నిర్మాణ పను లను తమ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. రొట్టెలపండుగ నాటికి ఈ ఆర్చి నిర్మాణాలు పూర్తి చేసి దర్గాకు సరికొత్త శోభన తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. మసీదు నిర్మాణానికి కూడా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్చి నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేసిన కలెక్టర్, కమిషనర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.

నెల్లూరు రూరల్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న శ్రీధర్‌రెడ్డి: అబ్దుల్ అజీజ్

అభివృద్ధి పనులకు ఎక్కడి నుంచ్కెనా నిధులు తెచ్చి నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నెంబర్‌వన్‌గా నిలుపుతాడన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో మాజీ మంత్రి కాకాణి

విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూకుమ్మరి కుటుంబంలో జన్మించి, ప్రాచీన భారతావనిలో అనేక కట్టుబాట్లు, ఆటుపోటులు ఎదుర్కొని మహిళా కవియిత్రిగా రాణించిన మొల్లమాంబ తెలుగుజాతికే గర్వకారణం. మొల్లమాంబ తెలుగులో రచించిన మొల్ల రామాయణం ఇప్పటికే అత్యంత ప్రసిద్ధికెక్కిన గ్రంధాలలో ఒకటి. తెలుగుజాతి గొప్పతనాన్ని కీర్తిని విశిష్టతను 16వ శతాబ్దంలోని లోకానికి చాటి చెప్పిన వీరవనిత మొల్లమాంబ.మహానేత వై.యస్. రాజశేఖర్ రెడ్డి కోరిక ఆనాటి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో, తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించింది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కృషి మేరకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రమును నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి, తాత్కాలిక భవంతిలో ప్రారంభించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచేందుకు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన కృషి మరువలేనిది. మొల్లమాంబ జయంతిని వేడుకగా నిర్వహించ తలపెట్టి, రాష్ట్ర పండుగగా ప్రకటించిన జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర వెనుకబడిన వర్గాలతో పాటు, నా ప్రత్యేక ధన్యవాదాలు.

సినీ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్యకు "మహాత్మా గాంధీ స్మారక పురస్కారం"

- అభినందనలు తెలిపిన డాక్టర్ పాదర్తి

విశాలాంధ్ర - కావలి: నిత్య ప్రయోగశిలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్యను మరో అత్యున్నత పుర స్కారం వరించింది. భువనేశ్వర్ ఒడిస్సాకు చెందిన ప్ర ముఖ సేవాసంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వారు దర్శకుడు పిసి ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి "మహాత్మా గాంధీ స్మారక విశిష్ట" వ్యక్తిగా అవార్డును ప్రకటించారు. ఈ విశిష్ట పురస్కారాన్ని తెలం గాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ టిపిసిసి ప్రచార కమిటీ కో కన్వీనర్ ప్రముఖ సం ఘసేవకులు "శ్రీ ఉప్పల శ్రీనివాసగుప్తా" చంద్రఆదిత్యను సత్కరించి మహా త్మా గాంధీ స్మారక పుం స్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ గత 30ఏళ్లుగా సినీ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి ఎంద రో నూతన కళాకారులను ప్రోత్సహిస్తున్నటువంటి ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అం దించి ఎన్నో అవార్డులు అందుకోవాలని అన్నారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్న ఆదిత్య స్పం దిస్తూ నా ఆ విశ్రాంతి సినీ ప్రయాణంలో మరి కొంతమంది నూతనటీనటుల్ని సాంకేతిక ప్రోత్స హిస్తానని హామీ ఇచ్చారు. మిత్రులు, గురువువర్యులు అయిన చంద్ర ఆదిత్యకు కావలికి చెందిన నంది అవార్డు గ్రహీత, డాక్టర్ పాదర్తి నాగరాజు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

నేడు బిట్రగుంటలో శ్రీనివాస కళ్యాణం

విశాలాంధ్ర - నెల్లూరు కలెక్టరేట్: కావలి నియోజకవర్గ పరిధిలోగల గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవంలో స్థానిక శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి తో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

చలో పిఠాపురానికి బయలుదేరిన జనసైనకులు

విశాలాంధ్ర - రాపూరు: పిఠాపురంలో ఈనెల 14 వ తేది శుక్రవారం జరిగే జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాపూరు నుండి జనసేన వీరమహిళ మండల జనసేన అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి,జల్లేళ్ల రాజెష్,పి ఆర్ పి మాజీ మండల అధ్యక్షులు గుండు రాఘవయ్య లో అద్వార్యాన బస్సుటెంపో లో గురువారం సాయంత్రం జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ యువత బయలు దెరడం జరిగింది

పాస్‌పోర్ట్ పోయినది

సప్రం మహేశ్వరి w/o సప్రం కృష్ణమూర్తి అను నా యొక్క పాస్‌పోర్టు (J2832820) జిరాక్స్ నిమిత్తము తీసు కొని వెళ్లుచుండగా ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్‌కి ఫోన్ చేయగలరు.

ఫోన్ నెంబరు: 8499833569

సప్రం మహేశ్వరి w/o సప్రం కృష్ణమూర్తి

నెల్లూరు

పాస్‌పోర్ట్ పోయినది

సప్రం కృష్ణమూర్తి s/o సప్రం వెంకటసుబ్బయ్య అను నా యొక్క పాస్‌పోర్టు (J2832822) జిరాక్స్ నిమిత్తము తీసు కొని వెళ్లుచుండగా ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్‌కి ఫోన్ చేయగలరు.

ఫోన్ నెంబరు: 8499833569

సప్రం కృష్ణమూర్తి s/o సప్రం వెంకటసుబ్బయ్య

నెల్లూరు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర- రాపూరు: వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి లబ్ధిదారులకు తోడ్పాటు అందించాలని రాపూరు ఎంపీడీవో భవాని సిబ్బందికి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈతో కలిసి రామకృష్ణ మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, బిసి, ఎస్టి లబ్ధిదారులకు గృహ నిర్మాణం ఫైనాన్స్ ఆర్థిక సహాయంలో ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అధనంగా మంజూరు చేయడం జరిగిందని వివరించారు. వివిధ స్టేజీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడానికి లబ్ధిదారులకు తోడ్పాటు అందించాలని సూచించారు.

గ్రామాల్లో చేతి పంపులకు మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర - రాపూరు: వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లోని చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవో భవాని అధికారులు, సిబ్బంది ఆదేశించారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వీలైనంత త్వరగా చేతి పంపులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు ఖాజా మోహిద్దీన్, చిట్టేటి సురేంద్ర, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర - నెల్లూరు కలెక్టరేట్: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఆటల పోటీల్లో పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్‌కు చెందిన పలువురు మహిళా ఉద్యోగులు ఆటపోటీలలో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొని దాదాపు 25మంది పంచాయతీరాజ్ మహిళా ఉద్యోగులు ఆటల పోటీలలో గెలుపొందినట్లు ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీ రియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య తెలిపారు. గెలుపొందిన జెడ్పీ చైర్మన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ, జే మోహన్ రావు చేతుల మీదగా బహుమతి ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు అన్నపూర్ణమ్మ, గిరిజ, ప్రసన్న, పరిపాలన అధికారులు కొండయ్య, సిహెచ్ ఉమాశంకర్, ముజీబ్, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుట్టుపాలెంలో పోలీసుల 'పల్లెనిద్ర'

విశాలాంధ్ర - రాపూరు: మండలంలోని చుట్టుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి రాపూరు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ వేంకట్ రాజేష్ సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ గ్రామస్తులతో మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని సూచించారు.

కిషోర్ రత్నంలో అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర - నెల్లూరు టౌన్: స్థానిక మనమసిద్ది నగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం తీర్థ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరిని అబ్బుర పరిచింది. 4వ సైన్స్ చిల్డ్రన్ కాన్ఫరెన్స్ వార్షికోత్సవం సందర్భంగా ప్రైమరీ ఒకటోవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులు పోటా పోటీగా విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు 110ప్రాజెక్టుల ప్రదర్శనతో ఆకర్షించారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయానికి సంబంధించిన జెర్మినేషన్ ఆఫ్ సీడ్స్, ఫ్రెండ్లీ ఎకో సిస్టమ్, రిఫలెక్షన్ ఆఫ్ లైట్, మెటల్ కండక్టర్ ఎలక్ట్రిసిటీ తదితర వాటిపై ప్రదర్శనలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఆ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల వాళ్లకు ఉన్న ఆసక్తిని ఇలా ప్రాజెక్ట్ రూపంలో ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. విద్యతోపాటు ఇటువంటి యాక్టివిటీస్‌లను నిర్వహిస్తూ ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, ఏఓలు తూహిన, సునీల్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు నగదు మంజూరు: డీఈ జహీర్ అహ్మద్

విశాలాంధ్ర - మనుబోలు: జిల్లాలోని అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు అదనపు నగదును మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా గృహ నిర్మాణ శాఖ డిఈ జహీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన మనుబోలు ఎంపిడిఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గృహ నిర్మాణ శాఖ మంత్రి ఆదేశాల మేరకు అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎస్టీలకు 75,000 ఎస్సీ బీసీలకు 50,000 చొప్పున అదనపు నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. జియో టాకింగ్ కూడా చేయడం జరుగుతుందని తెలిపారు. నెలాఖరులోపు అదనపు నగదు లబ్ధిదారులకు జమ కావడం జరుగుతుందని పేర్కొన్నారు. హౌసింగ్ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా చేయడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. 2017 నుండి 2025 వరకు ఉన్న వివిధ స్కీముల్లో వచ్చిన లబ్ధిదారులకు ఈ స్కీమ్ వర్తిస్తుందని తెలిపారు. ఈ అదనపు నిధుల మంజూరు ప్రక్రియను ప్రజలకు ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే ముఖ్య లక్ష్యం అన్నారు. ఎంపిడిఓ జలజాక్షి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల హౌసింగ్ అధికారులను కలిసి ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మించుకోవాలని కోరారు. మనుబోలు మండలంలో 686 మంది లబ్ధిదారులు ఎంపీ కావడం జరిగింది అన్నారు. మే నెల ఆఖరికి లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకుని ఇళ్లలో చేరే విధంగా ప్రణాళిక చేసుకొని లబ్ధిదారులు ఏ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ భాస్కరరావు, వర్క్ ఇన్స్పెక్టర్లు శరత్, శ్రీనివాసులు, డిజిటల్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - దగదర్తి: పిల్లలలో వచ్చే ప్రాణాంతక వ్యాధి తలసేమియా పై అందరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్ క్రాస్ వైద్యధికారిణి డాక్టర్ యన్ రమ్య పేర్కొన్నారు. గురువారం కావలి పట్టణం ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై అవగాహన, ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని యం సుగుణ ఆధ్వర్యంలో 7, 8 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన నెల వ్యవధిలోనే బయటపడే ఈ వ్యాధి వాళ్ళ పిల్లల ఆరోగ్యపరిస్థితి దయనీయంగా మారుతుందని, కొందరికి నెలకు మూడు సార్లు రక్తం ఎక్కిస్తేకానీ బ్రతికే పరిస్థితి ఉండదని అన్నారు. వయస్సుకు తగ్గట్టు ఎదగక పోవడం కూడా తల్లిదండ్రులను మరింత క్రుంగుబాటుకు గురిచేస్తుందని, నెలకు కనీసం పదివేల రూపాయలు ఖర్చు అవుతుందని, అదే గ్రూపు రక్తదాతల కొరకు తిరగాల్సివస్తుందని వివరించారు. తలస్సేమియా వ్యాధి ఉన్న పిల్లలకు అండగా ఉండడానికి కావలిలో రెడ్ క్రాస్ సంస్థ తలసేమియా డే కేర్ సెంటర్ ను ప్రారంభించిందని, అందువలన తలసేమియా వ్యాధి లక్షణాలైన రక్తలేమి, విపరీతమైన అలసట, వయస్సుకు తగ్గట్టు ఎదగక పోవడం తదితర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, తమ తలసేమియా ఆసుపత్రికి తీసుకువస్తే వారికి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు, మందులు, పౌష్టిక ఆహారం, తరచూ వైద్యపరీక్షలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. తలసేమియా డే కేర్ సెంటర్ కన్వీనర్ కె హరినారప రెడ్డి మాట్లాడుతూ, తలసేమియా వ్యాధిపై అవగాహన మరియు వ్యాధి ఉన్నవారిని గుర్తించడానికి పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు, ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో 150 మందికి ఉచిత రక్తగ్రూపు పరీక్షలు చేశారు. డాక్టర్ మదన్, ఉపాధ్యాయులు చాముండేశ్వరి,కవిత, టీం సేవియర్స్ ప్రణీత్, హరిచందన, రెడ్ క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 5864మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు: జాయింట్ కలెక్టర్ కార్తీక్

విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 5864.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 927 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ పిలుపునిచ్చారు.

ప్రయాణికులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - రాపూరు: రాపూరు ఆర్టీసీలో గూడూరు, వేంకటగిరి రూట్లలో తిరిగే ప్రయాణికులకు అమలు చెస్తున్న గిఫ్ట్ స్కీంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయబడిన వారికి రాపూరు బస్టాండ్ కంట్రోల్ పాయింట్ వద్ద గిఫ్ట్ ఐటమ్ బహుమతులు అందించినట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు రూట్‌లో, వెంకటగిరి రూట్‌లో అమలు చేస్తున్న గిఫ్ట్ స్కీంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయబడిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు వివరించారు. గూడూరు రూట్‌లో టి.వనమ్మ, జి.రాఘవరెడ్డి. వెంకటగిరి రూట్‌లో ఎస్‌కె ఆరీఫా, కె.మునీంద్రాలకు బహుమతులు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఐ, ఏఎంఎఫ్, డిసి(ఇ), ఆన్‌డ్యూటీ కంట్రోలర్, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఆదాలను సత్కరించిన నెల్లూరు రూరల్ వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - నెల్లూరు కలెక్టరేట్: నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డిని గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పలువురు వైసీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. రూరల్ నియోజకవర్గ వికలాంగుల విభాగం అధ్యక్షులుగా నియమితులైన సాదు పెంచల్ రెడ్డి, 23వ డివిజన్ వైసీపీ ఉపాధ్యక్షులుగా నియమితులైన ఉండేలా నారాయణరెడ్డి తదితరులు మాజీ ఎంపీ ఆదాలను శాలువాలు కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిగారు నూతనంగా పదవులు పొందిన నాయకులను అభినందించి సూచించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జ్ యనమల మల్లికార్జున రెడ్డి తదితరులు ఉన్నారు.

16న పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర - నెల్లూరు కలెక్టరేట్: ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఈ నెల 16న జయంతి వేడుకలు సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రజలు ఆకుకూర బస్టాండ్ సమీపమున గల అమరజీవి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించాలని ఆయన కోరారు.

సంగంలో నకిలీ ఎస్ఐ అరెస్ట్

విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో: సంగంలో నకిలీ ఎస్ఐగా చెలామణి అవుతూ తిరుగుతున్న హరీష్ అనే వ్యక్తిని సంగం పోలీసులు అరెస్ట్ చేశారు. సంగం పోలీస్ స్టేషన్లో నకిలీ ఎస్ఐ అరెస్ట్ గురించి ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్, సీఐ వేమారెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సంగం కొత్త చెక్ పోస్ట్ వద్ద నకిలీ ఎస్ఐగా వేషధారణ వేసి వాహనాలు ఆపి రికార్డులు పరిశీలిస్తుండగా రాబడిన సమాచారం మేరకు అరెస్ట్ చేశామని తెలిపారు. ముద్దాయి నుంచి కారు, నకిలీ యూనిఫాం, బెల్ట్, సింహాలు, బూట్లు, నేం ప్లేట్, టోపీ, నక్షత్రాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. సిద్దీపురానికి చెందిన హరీష్ అనే ముద్దాయి 2023లో వచ్చిన ఎస్ఐ ఫలితాల్లో సెలెక్ట్ అయ్యానని నమ్మించి నకిలీ ఎస్ఐ వేషధారణ వేసి మోసం చేస్తూ తిరుగుతున్నాడని తెలిపారు. సైజుకు తగ్గట్టు ఎస్ఐ యూనిఫాంలు కుట్టించుకుని బెల్ట్, సింహాలు, బూట్లు, నేంప్లేట్, టోపీ, నక్షత్రాలు తయారు చేయించుకుని నకిలీ ఎస్సైగా చెలామణి అవుతూ పలు ప్రాంతాలలో వాహనాలు నిలిపి నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడని వెల్లడించారు. ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. డిజిటల్ అరెస్ట్‌లను ఎవరూ నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డిజిటల్ అరెస్ట్‌లో గురించి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్, సిబ్బందిని అభినందించారు.

'అపోలో'లో 100కి పైగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు

విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో: నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో 100కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని, వారంతా పూర్తి ఆరోగ్యంగా జీవిస్తున్నారని అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, నెఫ్రాలజీ విభాగ అధిపతి డాక్టర్ ఏ.కేచక్రవర్తి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బి. మస్తాన్ వలీ వెల్లడించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా హాస్పిటల్ లో వారు గురువారం మీడియా తోమాట్లాడుతూ రక్తాన్ని వడపోసే కిడ్నీలు దెబ్బతింటే దాని ప్రభావం శరీరమంతా ఉంటుందని, వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అన్నారు. కిడ్నీకి సమస్య తలెత్తిన వెంటనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రతీ 10 మందిలో ఒకరికి కిడ్నీ సమస్య ఉంటుందని, సాధారణ వ్యక్తుల కంటే కిడ్నీ సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో భావోద్వేగాలు ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో గుర్తించినట్లు డాక్టర్ శ్రీ రామ్ సతీష్, డాక్టర్ ఏకే చక్రవర్తి, డాక్టర్ మస్తాన్ వలీ వెల్లడించారు. కిడ్నీ సమస్యలు ఎదుర్కొనే వారికి గుండెపోటుతో పాటు ఇతర స్ట్రోకులు, ఫ్రాక్చర్స్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కిడ్నీ సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే ఇతర జబ్బులు సోకకుండా ఉంటాయని వారు తెలిపారు. షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి కిడ్నీ సమస్యలు అధికంగా వస్తాయని కనుక ఆయా సమస్యలతో బాధపడే వారు సరైన చికిత్స తీసుకుంటే కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చునని చెప్పారు. పరిశుభ్రమైన మంచినీరు తాగడం మూలంగా కూడా కిడ్నీ సమస్యలు దూరమవుతాయన్నారు. జనాభాలో 10 శాతం మంది ప్రజలు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని, దీనిపై ప్రభుత్వం ఆలోచించి, కిడ్నీ సమస్యలను ముందుగానే గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ లో ఇప్పటి వరకూ 100కి పైగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని, వారంతా పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలియజేశారు. కిడ్నీ సమస్యల చికిత్సతో పాటూ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అపోలో హాస్పిటల్ లో అనుభవజ్ఞులైన వైద్యులతో పాటూ అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, కిడ్నీ రోగులు అపోలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిడ్నీ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ఏడాది " ఆర్ యూ కిడ్నీ ఓకే ?, డిటెక్ట్ ఎర్లీ, ప్రొటెక్ట్ కిడ్నీ హెల్త్. అనే నినాదంతో ముందుకెళుతున్నామని తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో వారితో పాటూ హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు కూడా పాల్గొన్నారు.

టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

విశాలాంధ్ర - కందుకూరు రూరల్: టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరులో గురువారం కళాశాలలో 23-24, 24-25 ఏడాదికి గాను కళాశాలలో నిర్వహించిన అకడమిక్, బోధన అభ్యసన, పరిశోధన, అవస్థాపన సౌకర్యాలు, విద్యార్థుల పురోగతి, పరిపాలన, హరితావరణం తదితర కార్యకలాపాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కనిగిరి నుంచి డాక్టర్ జయకుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉలవపాడు నుంచి డాక్టర్ మాణిక్యరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అకడమిక్ అడ్వైజర్స్ వివిధ విభాగాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కళాశాల యొక్క పురోగతిని, అధ్యాపకులగైడెన్స్, విద్యార్థుల యొక్క సృజనాత్మకతను మెచ్చుకున్నారు. కళాశాల పరిశోధనా విభాగంలో మరింత పురోగతి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, అకడమిక్ అడ్వైజర్స్ యొక్క సలహాలను పాటించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందిస్తామని తెలియజేశారు. అకాడమిక్ ఆడిట్ కోసం కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

విశాలాంధ్ర - కందుకూరు రూరల్: తొలి తెలుగు కవయిత్రిమొల్లమాంబ జయంతి కందుకూరు పట్టణ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దంకి సుబ్బారావు కందుకూరు పట్టణ శాలివాన సంఘ అధ్యక్షులు కలికివాయి కృష్ణ ఉపాధ్యక్షులు ఆముదాలపల్లి మాల్యాద్రి ప్రముఖ కంటి వైద్యులు ఉప్పుటూరి వెంకయ్య సీనియర్ పాత్రికేయులు ఉప్పుటూరి మాధవరావు మరియు పలువురు శాలివాహన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాలివాన సంఘం ఉపాధ్యక్షులు అద్దంకి సుబ్బారావు మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ యొక్క గొప్పతనం గురించి ఆమె సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తెలుగులో అనువదించిన విధానాన్ని గురించి వివరించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ జయంతిని రాష్ట్ర పండుగగా అధికారకంగా నిర్వహించిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు.

పట్టుదలతోనే విజయాలు సాధ్యం

- వైసి వెంటోరియస్ గ్రూప్ సీఈవో చిన్ని యశోవర్ధన్

విశాలాంధ్ర - కావలి: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీను లేదని ధైర్యంతో ముందుకు సాగితే విజయం తప్పక వరిస్తుందని వై.సి వెంటోరియస్ గ్రూప్ సీ.ఈ.ఓ చిన్ని యశోవర్ధన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు సాయి భక్త మండలి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి చిన్ని యశోవర్ధన్ ను కమిటీ సభ్యులు ఘనంగా శాలువులతో ,పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా చిన్ని యశోవర్ధన్ మాట్లాడుతూ తనను ఘనంగా సత్కరించిన సాయి భక్త మండలి సభ్యులు, ఆర్యవైశ్య లకు కృతజ్ఞతలు తెలిపారు. చదువుకునేటప్పుడే మన భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకుని మనం అనుకున్నది సాధించే దిశగా ప్రయత్నం చేస్తే విజయం తప్పక వరిస్తుందని దానికి నిదర్శనం నేనే అని తెలిపారు. అందరూ ఎంచుకునే మార్గం కాకుండా కష్టమైనా మెరైన్ ఇంజనీర్ గా పూణేలో పూర్తి చేసి ఉద్యోగరీత్యా షిప్ లలో పనిచేస్తూ ఉన్నత స్థితికి చేరుకున్నానని అలానే ఉద్యోగం తోనే ఆగిపోకుండా మన ఆశయాలను నెరవేర్చుకునేందుకు కష్టపడి ఆ షిప్ లకే ఓనర్ అయ్యానని అన్నారు. ఆ షిప్పులపై నా పేరు చూసుకున్నప్పుడల్లా నాకు చాలా గర్వంగా ఉంటుందని అన్నారు.నేను కావలికి చెందిన తులసి హార్ట్ ఫుడ్స్ అధినేత వరప్రసాద్ కూతురిని పెళ్లి చేసుకోవడం అదృష్టం వరించిందని అలానే నా విజయం లో నా సతీమణి నా వెంటే ఉండి నా విజయానికి బాటలు వేసిందని అన్నారు. అలానే సొంత గడ్డ నెల్లూరుపై ఉన్న అభిమానంతో నెల్లూరు ఇండస్ట్రియల్ జోన్ లో గ్రీన్ టెక్నాలజీ ఉపయోగించుకోవాలని కోరికతో టెర్రినోవా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించానని అన్నారు. అలానే యువత ఇండస్ట్రియల్ వైపు అడుగులు వేయాలని తపన ఉంటే మా కంపెనీని సంప్రదించిన వారికి అవకాశాలతో పాటు సలహాలు సూచనలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి భక్త మండలి సభ్యులు ఏ రామకృష్ణ, జీ.వీ.ఎస్ ప్రసాద్, కె.వి.ఎన్ కుమార్, కె.వి కృష్ణ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహ నిర్మాణానికి చర్యలు

విశాలాంధ్ర - కందుకూరు రూరల్: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఫలితంగా.. పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తోడ్పాటుతో, కందుకూరు పట్టణంలో ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహం ప్రధానమంత్రి అజయ్ (ప్రధానమంత్రి అను సుచిత్ జాతి అభ్యుదయ యోజన) పథకానికి ఎంపిక కావడంతో., నూతన భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయా కల్పన, అధునాతన వంటశాల, ప్రహరీ గోడల ఏర్పాటుకు ?. 3. 30. కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులు త్వరలో రానున్నాయి. దీంతో సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో వసతి గృహ ఏర్పాటు సాకారం కానుంది పేద ఎస్సీ బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అనన్య సామాన్యమైన కృషి ఫలితంగా, పి యమ్. అజయ్ పథకానికి కందుకూరులో ఉన్న బాలికల వసతిగృహం ఎంపీ కావడం పట్ల పలువురు విద్యావేత్తలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఈ పథకానికి కేవలం రెండు ప్రాంతాలలోని వసతి గృహాలు మాత్రమే ఎంపిక కావడం విశేషం. వాటిలో జిల్లాలోని మనుబోలు తోబాటు, కందుకూరు కూడా ఉండడం పట్ల,సమున్నత పథకాలు సాకారం చేసుకోవడంలో ఎమ్మెల్యే . కృషి నీ పలువురు ప్రశంసిస్తున్నారు.గత కొన్ని దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న కందుకూరు బాలికల ఎస్సీ వసతి గృహం త్వరలోలే అంగరంగ వైభవంగా నూతన భవనాలతో శోభిల్ల నున్నదని, ఇది బాలికల విద్య పటిష్టతకు పూర్తిగా దోహదపడుతుందని పట్టణ ప్రజలు అంటున్నారు.

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

విశాలాంధ్ర- కావలి: కావలి కచ్చేరిమిట్టలోని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారతే ధ్యేయంగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, ఉపాధి కేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ దిలీప్ కుమార్ రాయపాటి సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటాడని 20 మంది పిల్లలకి ఆహారంతో పాటు వారిని చదివిస్తూ వారికి అన్నీ తానై ముందుకు నడిపిస్తూ మరొక ముందడుగు వేసి పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణా మరియు ఉపాధి లాంటి కార్యక్రమం చేపట్టడం ఎంతో హర్షనీయమని,సమాజంలో ఇటువంటి వ్యక్తులు మరింత మంది తయారైతే ఆ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ శిక్షణలో చేరే ప్రతి మహిళ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని కుటుంబానికి చేదోడుగా తయారు కావాలని కోరారు. కాబట్టి ఇటువంటి సేవా కార్యక్రమాలను ఉపయోగించుకుని వారు ఆర్థికంగా ఎదగడం వ్యక్తిగతంగా వారికి మరియు వారి కుటుంబానికి ఎంతో మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ కోఆర్డినేటర్ బాబ్జి కి కృతజ్ఞతలు తెలుపుతూ టైలరింగ్ శిక్షణకు విచ్చేసిన మహిళా సోదరీలందరకు అభినందనలు తెలియజేశారు.

పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఆర్‌డీసీ డీఎం అనిల్ కుమార్ వెల్లడి

విశాలాంధ్ర - రాపూరు: 10వ తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేది నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. అప్పటి వరకూ విద్యార్థులందరికీ వారి స్వస్థలం నుంచి పరీక్షా కేంద్రం వరకు, తిరిగి పరీక్ష కేంద్రం నుంచి వారి స్వస్థలం వరకు పరీక్షలకు వెళ్లే విద్యార్థులు హాల్ టిక్కెట్ ద్వారా అన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ, ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా అనుమతించబడును. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి

విశాలాంధ్ర - కావలి: కావలి నియోజకవర్గంలో రాజ్ న్యూస్ రిపోర్టర్ పనిచేస్తున్న బత్తిన మనోహర్ ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి కావలి పట్టణంలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుం టున్నారు విషయం తెలుసుకున్న కావలి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి రిపోర్టర్ మనోహర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ దర్బార్ ఫ్యామిలీ దాబాను. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు.వ్యాపారం దినదినాభివృద్ధి జరగాలని కోరుకున్నారు.. కావలి పట్టణం 4వ వార్డుకు పాతఊరుకి చెందిన టిడిపి నాయకుడు ఉప్పాల శ్రీనివాసులు తల్లి రావమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.